క్లుప్తంగా

'స్పందన'కు 5 అర్జీలు



రేపల్లె: స్పందన కార్యక్రమంలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన అర్జీలు స్వీకరించారు. సర్వేకు 2, పెన్షన్‌కు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు, శ్మశాన వాటిక పంచాయతీకి అప్పగించాలని మొత్తం ఐదు అర్జీలు అందాయని ఆర్డీఓ తెలిపారు. సమస్యలను పరిశీలించి, పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా చక్రపాణి ప్రసాద్ బాధ్యతలు



నగరం: ఎంపీడీఓగా ఎంకే చక్రపాణి ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.రాధారమణ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీడీఓ అన్నారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

నూతన హెచ్‌ఎంకు శుభాకాంక్షలు



పిట్టలవానిపాలెం: పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ప్రధానోపాధ్యాయిని కె.శైలజ పేర్కొన్నారు. మంతెనవారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఆమె సమావేశం నిర్వహించారు. నూతనంగా విధుల్లో చేరిన హెచ్‌ఎం శైలజకు, స్కూలు అసిస్టెంట్ జంపాని శ్రీనివాసరావుకు ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సాహంగా వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నీ



కొల్లూరు : వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నీ సీజన్–2 సోమవారం ఉత్సాహంగా సాగింది. 4వ దశకు 12 జట్లు అర్హత సాధించాయని నిర్వాహకులు తెలిపారు. బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్‌నాగ్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, ప్రోత్సాహక బహుమతిగా క్రికెట్ బ్యాట్లను అందజేశారు. వేమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు కూచిపూడి మోషే, పాలిమేర నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

పూరిళ్లు దగ్ధం



పెరవలి(వేమూరు): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల రెండు పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయని తహసీల్దారు శ్రావణకుమార్ సోమవారం తెలిపారు. పెరవలి గ్రామంలో తెల్లవారు జామున ఈ ఘటన చోటుచేసుకున్నట్లు వెల్లడించారు. గ్రామానికి చెందిన బోర్రా రవి, బోర్రా పార్వతమ్మ ఇళ్లు పూర్తిగా దగ్ధమైనట్లు చెప్పారు. బోర్రా రవి ఇంటిలో రూ.4 లక్షల నగదు, 10 గ్రాములు బంగారం పూర్తిగా కాలి పోయిందని, సామగ్రితో సహా రూ.7 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పార్వతమ్మ ఇంటిలో రూ.20 వేలు నగదు, 30 గ్రాములు బంగారం కాలిపోయిందని, రూ.2.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. అగ్ని ప్రమాద బాధితులకు ప్రభుత్వం తరపున బియ్యం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ దాది వెంకట లక్ష్మీరాజ్యం, దాది సుబ్బారావు బాధితులను పరామర్శించారు.

ఆర్టీఓ బాధ్యతల స్వీకరణ

తెనాలిరూరల్: తెనాలి ప్రాంతీయ రవాణా అధికారి(ఆర్టీఓ)గా కె. ప్రసాద్ బాధ్యతలను సోమవారం స్వీకరించారు. చిత్తూరు జిల్లా కార్వేటినగర్ ఆయన స్వస్థలం. ఎస్వీ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేసిన ఆయన 2018 నోటిఫికేషన్ ద్వారా గ్రూప్–1కు ఎంపికయ్యారు. 2022 సెప్టెంబర్‌లో తెనాలి ఆర్టీఓ బాధ్యతలు స్వీకరించి, మరుసటి రోజే రిలీవ్ అయి తొమ్మిది నెలలు శిక్షణకు వెళ్లారు. శిక్షణానంతరం సోమవారం ఇక్కడకు వచ్చి తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఆర్టీఓకు ఎంవీఐ తోట రాఘవరావు, ఏఎంవీఐ మధుసూదనరావు, సిబ్బంది స్వాగతం పలికారు.

జగనన్న పాలనకు మచ్చుతునక విద్యాకానుక

- కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా సర్కారు బడులు
- ఎమ్మెల్యే కోన రఘుపతి
- పాఠశాలల పునఃప్రారంభం రోజునే 'విద్యాకానుక' కిట్లు పంపిణీ



విద్యా కానుక పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్ : సర్కారు పాఠశాలల విద్యార్థులు అన్ని అంశాల్లోనూ.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉండాలని, ఉన్నత స్థానాల్లో నిలవాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. మర్రిపూడి గ్రామంలోని ఎయిడెడ్ పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్‌లను ఆయన విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. విద్యాకానుక ద్వారా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, కుట్టు కూలితో సహా మూడు జతల యూనిఫామ్ క్లాత్, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగుతోపాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ (6–10 తరగతి పిల్లలకు), పిక్టోరియల్ డిక్షనరీ (1–5 తరగతి పిల్లలకు)తో కూడిన సుమారు రూ.2,500 విలువైన కిట్‌ను అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఉన్న నిబద్ధతకు మచ్చుతునక విద్యాకానుక అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మర్రిపూడి మాజీ సర్పంచ్ మున్నం సుమన్ స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: మండలంలో అన్ని పాఠశాలల్లో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. వెల్లటూరు ప్రాథమిక పాఠశాల(ఎల్ఈ)లో సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ మేరుగ చలంబాబు, రోజారమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బీఆర్ స్కూల్, ఉర్దూ పాఠశాలలో సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపీటీసీ కొతరపు పద్మావతి, వార్డు సభ్యురాలు గోలి సుధారాణి పాల్గొన్నారు. పెసర్లంక దేవభక్తుని కోటయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో చింతమోటు, పెసర్లంక సర్పంచులు గుమ్మడి శంకరరావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, హెచ్ఎం ఎస్‌కే మహబూబ్ బాషా, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, భట్టిప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుమ్మడి సాంబశివరావు, ఉపాధ్యాయుడు వి.సురేష్‌బాబు పాల్గొన్నారు. ఐలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మాచర్ల మోహన్‌రావు, సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ మురుగుడు శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ పులిమి కుసుమ కుమారి కిట్లు పంపిణీ చేశారు. పల్లెకోన జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీటీసీ దున్నా తిరుపతిబాబు, హెచ్ఎం ఈగ మునియ్య కిట్లు పంపిణీ చేశారు.

కొల్లూరు బాలుర ఉన్నత పాఠశాలలో..

కొల్లూరు: కొల్లూరు బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్‌లను జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు పంపిణీ చేశారు. మండలంలోని 53 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు 3,241 మందికి జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ మురాల రాంబాబు పాల్గొన్నారు. అలాగే..తోకలవారి పాలెం ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ టి. కృష్ణమోహన్ నేతృత్వంలో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు డా.బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ, భగత్ సింగ్ చిత్రపటాలను విద్యార్థులకు అందజేసి పాఠశాలకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో కొల్లూరు బాలుర ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జ్యోతి, హెచ్ఎం కె.నాగపాప, తోకలవారిపాలెం హెచ్ఎం ఎస్.శ్యామ్‌బాబు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అంజయ్య



కిట్‌లు పంపిణీ చేసిన జెడ్పీటీసీ హేమలత



కిట్లు పంపిణీ చేసిన ఎంపీపీ లలిత కుమారి



గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలతో స్వాగతం

పిట్టలవానిపాలెంలో..

పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లను మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చేబ్రోలు కృపానందం పంపిణీ చేశారు. ఎంపీడీఓ వి.వెంకటేశ్వరరావు, హెచ్ఎం మాధవరావు ఉన్నారు.

ఆరేపల్లి పాఠశాలలో

చెరుకుపల్లి: ఆరేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈఓ టి.నవీన్ కుమార్ జగనన్న విద్యాకానుక కిట్లు విద్యార్థులకు పంపిణీ చేశారు. పులిగడ్డవారిపాలెం ఎంపీపీఎస్‌లో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామినేని కోటేశ్వరరావు చిన్నారులకు కిట్లు అందించారు. మండలంలోని 66 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 4,177 మంది విద్యార్థులకు కిట్లు అందించనున్నట్లు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమాల్లో ఆరేపల్లి సర్పంచ్ మోగలిపువ్వు కోటేశ్వరరావు, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కె.రమేష్ బాబు పాల్గొన్నారు. నల్లమోతువారిపాలెంలో ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు, గణపవరం ప్రాథమిక పాఠశాలలో ఎంపీటీసీ దిండి నాగలక్ష్మి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు.

నగరం ప్రాథమికోన్నత పాఠశాలలో

నగరం: స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యా కానుక కిట్‌లను విద్యార్థులకు ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాన్యం నాగమణి, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఎంఈఓ కొలసాని హరిబాబు, సర్పంచ్ ఇంకొల్లు రామకృష్ణ, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జంపని ఉన్నత పాఠశాలలో..

జంపని(వేమూరు): జంపని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యా కానుక కిట్‌లను విద్యార్థులకు జెడ్పీటీసీ గాజుల హేమలత పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ చుండూరు పెద మరియమ్మ, మండల ఉపాధ్యక్షుడు షేక్ బాజీ, ఎంఈఓ కె.లక్ష్మీనారాయణ, హెచ్ఎం పి.ఎస్.స్వామి, సొసైటీ అధ్యక్షుడు గాజుల భానుప్రకాశ్, బద్రినాయరాయణ, విద్యా కమిటీ చైర్మన్ అలీఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కైతేపల్లిలో..

రేపల్లె రూరల్: సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు, కైతేపల్లి సర్పంచ్ మండలి అంజయ్య ఆ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు.

అమర్తలూరులో..

అమర్తలూరు: అమర్తలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్‌లను ఎంపీపీ రాపర్ల నరేంద్ర పంపిణీ చేశారు. ఎంఈఓ చీకటి రవికాంత్, సర్పంచ్ రాము, ఎస్ఎంసీ చైర్మన్ వెంకయ్య, హెచ్ఎం నీరీక్షణరావు పాల్గొన్నారు.

చుండూరులో..

చుండూరు: ఎంపీపీ జాలాది రూబేను మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్‌లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం పి.లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివరామ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో..

కర్లపాలెం: కర్లపాలెం పంచాయతీ ఎంపీ రాజు పాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్‌లను విద్యార్థులకు ఎంపీపీ యారం వనజ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం విజయ్ భాస్కర్‌రెడ్డి, పీడీ శ్రీనివాసరావు ఉన్నారు. గణపవరం, చింతాయపాలెం ఉన్నత పాఠశాలల్లో జెడ్పీటీసీ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ రాతంశెట్టి లక్ష్మణరావు, ఎంపీరాజుపాలెం ఉర్దూ పాఠశాలలో ఎంపీటీసీ సభ్యుడు షేక్ ఆసిఫ్ అలీ విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు.



కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ



కిట్‌లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ కృపానందం



కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు



కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య.

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

కర్లపాలెం: అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కర్లపాలెంలో దగ్ధమైన ఇంటి యజమాని కాటూరి చిన నారాయణ కుటుంబాన్ని ఆయన సోమవారం పరామర్శించారు. ప్రభుత్వ పరంగా వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇటీవల అనారోగ్యానికి గురైన మండల పరిషత్ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు బాషాను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, బాపట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్ బేగ్, ఎంపీటీసీ ఆసిఫ్ అలీ, ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా తదితరులు ఉన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రేపల్లె రూరల్: పట్టణంలోని 13 వార్డులో మూడు వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ విజయసారథి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని, 28 నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు దరఖాస్తుచేసుకోవాలని, వచ్చే నెల 1న ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

చెరుకుపల్లిలో రెండు..

చెరుకుపల్లి: మండల పరిధిలోని గ్రామ సచివాలయాలు గూడవల్లి–1(ఎస్సీ), రాంబొట్లపాలెం–1 (బీసీ)లో వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వేడుకగా ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



కర్లపాలెం: అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో సోమవారం ప్రసన్నాంజనేయస్వామి సహిత గణపతి సుబ్రమణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు కనుల పండువగా జరిగాయి. జీవన్యాసం, కుంభం, గోముఖ దర్పణ దర్శనం, స్వామివారి అర్చన దర్శనం, నీరాజన మంత్రపుష్పాదులు మహాపూర్ణాహుతి, తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

సృజనాత్మకత పెంపునకు అంగన్‌వాడీలు దోహదం

కొల్లూరు: చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందించడానికి అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడుతాయని కొల్లూరు వైస్ ఎంపీపీ మురాల రాంబాబు పేర్కొన్నారు. సోమవారం గొడపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ప్రీ–స్కూల్ విద్యార్థుల శిక్షణకు ప్రభుత్వం అందజేస్తున్న మెటీరియల్ పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాల సేవలపై అవగాహన ప్రదర్శన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పౌష్టికాహారాన్ని పిల్లలకు సమయానుకూలంగా అందించడంతోపాటు, ఆటపాటలతో కూడిన విద్యనందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారుల మేదస్సుకు పదును

కొల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యతో చిన్నారుల మేదస్సుకు పదును పెట్టవచ్చని, అనంతవరం, దోనేపూడి సెక్టార్ల సూపర్ వైజర్లు మాధవి, నాగరాజకుమారి అన్నారు. సోమవారం పోతార్లంక, ఈపూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జన భాగీదారి కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులకు అంగన్‌వాడీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రీ–స్కూల్ విధానంపై అవగాహన ప్రదర్శన



ప్రదర్శన నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు ఆపన్నహస్తం

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం గ్రామంలో అగ్ని ప్రమాదం కారణంగా రెండు పూరిళ్లు దగ్ధమైన ఘటనలో బాధితులకు బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆపన్నహస్తం అందించారు. సోమవారం బాధితులు పంతగాని సుబ్బారావు(సుబ్బులు), పప్పుల నాగరాజుకు సంఘం తరపున రూ.10 వేలు, రాచూరు జమిందార్ రాజా మాణిక్యాలరావు వెంకట సిద్ధార్థ మార్కండేయరావ్ తరపున (రాచూరు బాబు) రూ.10వేలు.. మొత్తం రూ.20 వేలు నగదు ఆ కుటుంబాలకు అందజేశారు. సంఘం సభ్యులు బట్టు మల్లికార్జునరావు, జొన్నాదుల వెంకటేశ్వరరావు, కూరపాటి రఘురామయ్య, ఈడే శ్రీనివాసరావు, అత్తలూరి బాలకృష్ణారావు మరో రూ.10 వేలు సాయమందించారు. డోకుపర్తి గోపాల్, జొన్నాదుల లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నగదు అంద చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాస్వామ్య లౌకిక విలువలు కాపాడుకుందాం

భారత్ బచావో బాపట్ల జిల్లా కన్వీనర్ అందే శ్యామ్

భట్టిప్రోలు: ప్రజాస్వామ్య లౌకిక విలువలు కాపాడుకుందామని భారత్ బచావో బాపట్ల జిల్లా కన్వీనర్ అందే శ్యామ్ పేర్కొన్నారు. ఈ నెల 16న బాపట్లలో నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత్ బచావ్ జిల్లా సదస్సు ప్రచార కరపత్రాలను సోమవారం భట్టిప్రోలు బౌద్ధ స్తూపంలో ఆవిష్కరించారు. భారత్ బచావో కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. నిర్వాహకులు దాసరి వెంకటేశ్వరరావు, బీఎస్పీ వేమూరు నియోజకవర్గ కన్వీనర్ జడా రవీంద్రబాబు, ఏఐఎస్‌సీఆర్పీస్ నాయకులు లక్ష్మణ్, సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మట్టి తవ్వకాలకు 'మైనింగ్' అనుమతి తప్పనిసరి

కొల్లిపర: మండలంలో మట్టి, ఇసుక, బుసక తవ్వకాలకు మైనింగ్ నుంచి తప్పని సరిగా అనుమతులు పొందిన తరువాత మాత్రమే తవ్వకాలు జరపాలని తహసీల్దారు జి.నాంచారయ్య అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలో అనేక గ్రామాల్లో ఎటు వంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి అన్న విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రతి వీఆర్‌ఓ తన పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి , బుసక, ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అన్న విషయాలను గమనించాలని ఆదేశించారు. ఎవరైన రైతులు తమ పొలంలో మట్టి , బుసక తీయాలని అనుకుంటే వారు మైనింగ్ అధికారుల నుంచి తప్పని సరిగా అనుమతులు పొందాలని సూచించారు.

సస్యరక్షణ పాటిస్తే..అధిక దిగుబడులు

శనగలో సూక్ష్మపోషకాలు సరిచేస్తే మేలు



లక్ష్మి (బాపట్ల ఏడీఏ)

పిట్టలవానిపాలెం: రబీలో వేరుశనగ సాగును రైతులు చేపట్టారు. ప్రస్తుతం పంట కొంత పూత దశలో ఉంది. వాతావరణంలో ఉష్ణోగ్రతల మార్పుల కారణంగా.. సాగులో చీడ పీడలు, పోషక లోపాలను గుర్తించి జాగ్రత్తలు తీసుకుంటే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని బాపట్ల ఏడీఏ లక్ష్మి సూచిస్తున్నారు. అధికారులు, శాస్త్రవేత్తల సలహాల మేరకు ఎరువులు, మందులు వాడితే లాభాల బాట పట్టవచ్చని పేర్కొన్నారు.

పచ్చపురుగు..

శనగలో పచ్చపురుగు బెడద అధికంగా ఉంటుంది. వాతావరణంలో మార్పుల కారణంగా ఈ పురుగుల ఉధృతి అధికమైంది. పంట వెనక.. రెక్కలు పాలిపోయిన తెలుపు రంగుతో నల్లని అంచు కలిగి ఉంటాయి. గుడ్లు లేదా దాని నుంచి వెలువడిన పిల్ల పురుగులు హరితాన్ని పువ్వు మొగ్గలు, రేకులను గీకి తింటాయి. మొగ్గలు, పువ్వులు, కాయలను తొలచి తిని డొల్ల చేస్తాయి. పంట లేతగా ఉన్నప్పుడు ఇవి ఆకులను తింటాయి. కాయలకు గుండ్రటి రంధ్రాలు చేసి ఎక్కువ నష్టాన్ని కలిగిస్తాయి.

నివారణ..

సమగ్ర యాజమాన్య పద్ధతులతో ఈ పురుగును నివారించవచ్చును. ఎకరానికి నాలుగు నుంచి ఐదు లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలి. గుడ్లు చిన్న పురుగుల నివారణకు ఐదు శాతం వేప నూనెను పంటకు పిచికారి చేయాలి. ఎన్‌పీవీ ద్రావణాన్ని (వైరస్ ద్రావణం)ఎకరానికి 250 ఎల్ఈ తగినంత నీటిలో కలిపి సాయంత్రం వేళ పిచికారి చేయాలి.

తిక్కా ఆకుమచ్చ తెగులు..

పంట వేసిన 30 రోజుల నుంచి ఈతెగులు కన్పిస్తుంది. మచ్చలు గుండ్రంగా ఉండి ఆకు పైగాన ముదురు గోధుమ రంగు కలిగి ఉంటాయి. తెగులు కన్పించిన వెంటనే ఎకరాకు 400 గ్రాముల మాంకోజెబ్ లేదా హెక్సాకొనాజోల్ 400 ఎంఎల్ లేక కార్బన్‌డిజమ్ 200 గ్రాములు చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.



వేరుశనగ పంట



ఆకుమచ్చ తెగులు సోకిన మొక్క

వేరుశనగలో సూక్ష్మ పోషకాలు..

వేరుశనగ మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషక పదార్థాలు అవసరం. వీటిలో ముఖ్యమైన సూక్ష్మ పోషకాలైన కాల్షియం, సల్ఫర్, జింకు, ఇనుము వేరుశనగ పైరుకు చాలా అవసరం. ఇవి మొక్కలకు తగినంత అందనపుడు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతాయి.

కాల్షియం

మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే ఎంజైములను ఉత్తేజ పరచడానికి, వేర్ల అభివృద్ధికి బాగా తోడ్పడుతుంది. తాలు కాయలు ఏర్పడకుండా గింజలు లావుగా ఉండి కాయ నాణ్యత పెరిగేందుకు దోహదం చేస్తుంది. కాల్షియం లోపిస్తే.. వేరు చివరి భాగం నశించి పెరుగుదల ఆగిపోతుంది. కాండం విరుగుతుంది. కంచు రంగుకు మారి చిగుర్లు వంకరలు తిరుగుతాయి. వేర్ల అభివృద్ధి దెబ్బతిని బుడిపెల సంఖ్య తగ్గుతుంది.

నివారణ..

కాల్షియం లోప సవరణకు 200 కిలోల జిప్సంను తొలి పూత దశలో అంటే విత్తిన 40 రోజులకు మొక్క మొదళ్ల దగ్గరికి ఎగదోయాలి. జిప్సం వేసిన తర్వాత నీరు పెట్టాలి.

గంధకం..

ఇది నూనె శాతం పెరగడానికి, కాయలు మంచి రంగును కలిగి ఉండేందుకు, గింజ బరువు పెరగడానికి దోహదపడుతుంది. నేల నుంచి నత్రజని, భాస్వరం , పొటాష్ ఎరువులను ఎక్కువ పరిమాణంలో మొక్క తీసుకోవడానికి గంధకం దోహదం చేస్తుంది. ఊడల నుంచి కాయలు తెగిపోకుండా కాపాడుతుంది. వేర్లలో రైజోబియం బుడిపెలు ఏర్పడడానికి సహకరిస్తుంది. కొత్త ఆకులలో గంధకం లోప లక్షణాలు కన్పిస్తాయి. ఆకు ఈనెలు పసుపు రంగుకు, లేత ఆకులు పసుపు పచ్చగా మారతాయి. ముదురు ఆకులు మార్పు లేకుండా ఆకుపచ్చగా ఉంటాయి. అమ్మోనియం సల్ఫేట్ సూపర్‌ఫాస్ఫేట్, పొటాషియం సల్ఫేట్ ఎరువులు వాడాలి. గింజల్లో నూనె శాతం పెరగడానికి విత్తిన 40 రోజులకు జిప్సం వాడాలి.

ఇనుము..

ఈ పోషకం లోపించినప్పుడు ఆకులు పసుపు పచ్చగా మారతాయి. తర్వాత ఆకు మొత్తం పసుపు రంగుకు మారుతుంది. లేత ఆకులు సన్నగా, నిటారుగా పసుపు రంగుకు మారి పసుపు రంగు కోల్పోయి, తెలుపు రంగుకు మారతాయి. ముదురు ఆకులు ఎండి రాలిపోతాయి. ఇనుము లోపం వల్ల కిరణ జన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడుతుంది. పైరు ఎదుగుదల ఆగిపోయి దిగుబడి 30–40 శాతం తగ్గుతుంది. ఐదు గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ ఒక గ్రాము సిట్రిక్ ఆమ్లం కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. ద్రావణాన్ని ఎప్పటికప్పుడు కలుపుకుంటూ పిచికారి చేయాలి.

అగ్నిప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

రేపల్లె: పట్టణంలోని 3వ వార్డులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు మందా సత్యనారాయణను కమతం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కమతం సాంబశివరావు సోమవారం సోమవారం పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు తోటా వెంకట్రావు, లంకేశ్వరరావు, చందు, దినేష్, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న కమతం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ సాంబశివరావు

ఆర్థిక సాయం

రేపల్లె రూరల్: అగ్ని ప్రమాద బాధితుడు మందా సత్యనారాయణకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ రూ.20వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, జీపీ రామారావు, అగస్త్యశాస్త్రి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.